# బహుపరాక్!

కె.కె. రఘునందన



(గత సంచిక తరువాయి)

**చుట్టాలింటికెళ్ళిందన్న అందమైన అబద్ధం దుప్పటి కప్పకుని గడగడలాడుతున్నాం. ఏ క్షణంలోనైనా పరువు ప్రతిష్ఠలు తలుపులు బార్లా తెరిచేసుకుని వీధిన పడకపోవు.**

**లోకం టముకు పట్టుకుని నిందల దరువులు వాయిస్తుంది. మరి .. మరి తామేం చేయాలి. ప్రస్తుత కర్తవ్యం ఏమిటి?**

కాలింగ్ బెల్.

కిటికీలోంచి చూశాను. నడివయస్సులో మనిషి చేతిలో సూట్ కేసుతో..

"నేనూ సుదర్శనాన్ని" అన్నాడు.

గడ్డం మీద పోల్చలేకపోయాను.

నేను వాడు ఒక చదువు చదివినా ఉద్యోగం రాని వాడు మెకానిక్ అవతారం ఎత్తాడు. వాటర్ సర్వీసింగ్‌తోపాటు సెకండ్ హేండ్ వెహికల్స్ కొనటం, అమ్మటం చేస్తుంటాడు.

మౌనికకు బండి కొనేటప్పుడు వాడే స్వయం గా షాపుకి తీసుకెళ్ళాడు. డ్రైవింగ్ కూడా నేర్పాడు.

సుదర్శనం రాక మాలో బితుకు పుట్టించింది.

"ఏరా బాగున్నారా? ఏం చెల్లెమ్మా క్షేమమా? మౌనికా... మౌనికా... ఇంట్లో లేదా?" వరస ప్రశ్నలు వేశాడు సుదర్శనం.

"అది సింహాచలంలో ఫ్రెండింటికి వెళ్ళింది" చెప్పాను.

"మరి బండేదీ? " వీధిలోకి చూస్తూ అడిగాడు.

"ఆ బండి మీదనే వెళ్ళింది"

"సింహాచలం బండి మీద పంపావా? మరి నేను చూసింది పొరపాటేనేమోలే.. సర్లే" అని మా వైపు చూశాడు సుదర్శనం.

"ఏమిట్రా ఏమిట్రా నువ్వు చూసింది. చెప్పరా ప్లీజ్" ఆదుర్దా నా కంఠం నుండి పొర్లింది.

"పొరపాటుగా చూసింది చెప్పేదేంటిలే ఇంతకీ" టాపిక్ మార్చబోయాడు.

"అది కాదన్నయ్యా! మీరు చూసిందేంటి చెప్పండి?" అర్థింపుగా అన్నది రాణి.

"మనిషిని పోలిన మనిషి ఉండొచ్చు కదమ్మా! అయినా నా పిచ్చిగాని మీరు సింహాచలం పంపిస్తే శ్రీకాకుళంలో ఎలా ఉంటుంది?'

"అదికాదురా సరిగ్గా చెప్పు. నువ్వు శ్రీకాకుళంలో చూశావా? ఖచ్చితంగా చెప్పు" ఆత్రత హెచ్చింది.

"నువ్వు సింహాచలం పంపింది కరెక్టేగా?" ఎదురు అడిగాడు సుదర్శనం.

"ఔను.. కానీ" సందేహంగా చూశాను.

"వెళ్ళిందో లేదో డౌటయితే ఫోన్ చేసి కన్‌ఫర్మ్ చేసుకోవచ్చుగా?"

"ఫోన్ నెంబర్ తెలీదు"

సుదర్శనంతో ఎలా డీల్ చేయాలో అర్థం కావట్లేదు.

"అదేంటి మీరిద్దరూ ఇంత ఖాళీగా ఉన్నారు. ఎప్పుడూ బీజీ బిజీగా ఉండేవారే.. ఇద్దరూ ఇంటిదగ్గర దొరకటం నా అదృష్టమేనన్న మాట."

సుదర్శనం చప్పింది అక్షరాలా నిజమే. ఉద్యోగాల హడావుడితోపాటు యూనియ న్లంటూ నేను, లేడీస్ క్లబ్బులంటూ రాణి బాగా కూరుకుపోయాం.

మౌనిక తన పనులు తాను చేసుకుని పోతుంది. మరల అందరం కలిసేది రాత్రే. అదీ ఎవరిమట్టుకు వాళ్ళం ఇల్లు చేరాకనే..

"ఏంట్రా అలా బొమ్మల్లాగుండిపోయావు? చెల్లెమ్మా నీ కళ్ళల్లో ఆ నీళ్ళేమిటి?" అని నిలదీశాడు సుదర్శనం.

చెప్పకనే చెప్పేది విషాదమైతే దాని జ్ఞాపికలు కనులంట రాలే నీటిబొట్లు...

"అన్నయ్యా నువ్వు చూసింది.." మరల రాణి సుదర్శనం మొహంలోకి చూసి ప్రాధేయంగా ప్రశ్నించింది.

"చెల్లెమ్మా నే చూసింది పొరపాటు కావచ్చు. కానీ మీరు చేసింది పొరపాటేమో" నిశితంగా చూస్తూ అడిగాడు సుదర్శనం.

"సింహాచలం పంపటమా?" అడిగింది రాణి.

"కాదు ఈ ఆత్మీయుడైన సుదర్శనంతో ఇంకా అబద్దాలాడ్డం" కటువుగానే అన్నాడామాట.

"అన్నయ్యా"

"ఓరే" మా ఇద్దరి గొంతుల్లో జీర.

"మీరింతసేపూ చెప్పింది అబద్ధమన్నది నిజమైతే, నే చెప్పబోయేది మాత్రం ముమ్మాటికీ నిజం. ఇంతదాకా దాపరికం ముసుగులో కప్పు కున్న మీ మొహాలు ఎంత వికృతంగా కనిపిం చాయో! ఛీ.."

"ఓరే సుదర్శనం" తట్టుకోలేకపోయాను.

"ఇలా ఎంతకాలం ఎంతమంది దగ్గర.. నిప్పులాంటి అబద్ధం దాచగలరు?"

మొహాలు చేతుల్లో దాచుకున్నాం.

"దాచినా ప్రయోజనం శూన్యం. ఏదోనాడు ఆ నిప్పుకణిక మహాజ్వాలగా మారి మొత్తం దగ్ధం చేస్తుంది." ఆగ్రహం వ్యక్తం చేశాడు సుదర్శనం.

"ఎందుకురా ఆ ఆవేశం?" ఆగలేక అనేశాను.

"మీ ప్రవర్తనకు గుండెలు మండిపోతున్నాయి." అగ్గిలాగయ్యాడు.

"మేమేం చేశాం?" తప్పు ఒప్పుకోనితనం బయటపడి ప్రశ్నగా మారింది.

"ఏం చేశారా? కన్నకూతురు కనుమరుగయ్యేసరికి మీకు ఎక్కడలేని బాధ్యతలు, బంధాలు గుర్తుకొచ్చాయి. కడివెడు కన్నీరు కారుస్తున్నారు. మీ బిజీ కార్యక్రమాల్ని తాత్కాలికంగా పక్కకు పెట్టి మరీ..."

"ఓరే"

"అసలు మీ అమ్మాయి ఏ సమయంలో ఎక్కడికి వెళ్తున్నదో ఏం చేస్తున్నదో కనీసం ఒక్కసారి పట్టించుకున్నారా? కాలేజీ, ట్యూషన్స్, స్టడీ సెంటర్, స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్, స్లిమ్‌నెస్ కోసం జాగింగ్‌లు, జిమ్‌లు. పైగా మీకు మగపిల్ల ల్లేక అమ్మాయిలోనే అబ్బాయిని చూడాలన్న వెర్రి తపనతో బండోటి కొనివ్వటం, ఫ్రీగా వదిలి పెట్టడం. ఇవన్నీ మీ పొరపాట్లు కాదా? ముక్కు మీద గుద్దినట్లుగా అడిగాడు సుదర్శనం.

"ఔనన్నయ్యా అంతా మా పొరపాటే"

"అని మీరు ఒప్పుకున్నా మీరు ఇంతకాలం చేసిన పొరపాట్లకి మౌనిక ఎంత పొరపాటు పనికి పూనుకుందో తెలుసా?"

"ఏమిట్రా నువ్వనేది?" గుండెల్ని కుదిపే ఉత్కంఠ నాలో..

"పిల్లలతో ఎంత చనువైతే వాళ్ళు మన భావాలను అంత గౌరవిస్తారు. పట్టించుకోకపోతే ఫలితం ఇలాగే ఉంటుంది. నాకూ ఉన్నది కూతుర్లే... నేనెంత బిజీగా ఉన్నా టైమ్ ప్రకారం నేనే దగ్గరుండి చదివిస్తాను. సినిమాలకు తిప్పుతాను. పర్వాలేదు మా నాన్నగారు నా గురించి శ్రద్ధ తీసుకుంటున్నారు అనే భావం పెంపొందిస్తాను. మరి మీరో కనీసం ఏ ఒక్కరైనా కాస్సేపు మీ అమ్మాయితో తీరిగ్గా గడిపారా? అనుభూతులు పంచుకున్నారా? ఆ.... ఒక్క క్షణం ఆలోచించండి. అందుకే మీ అమ్మాయి కూడా తనదారి చూసుకోవాలనుకుంది" దీర్ఘంగా నిట్టూ ర్చాడు సుదర్శనం.

"ప్లీజ్!మౌనిక ఎక్కడ? ఎక్కడుందన్నాయ్యా. కనిపించిందా? ప్లీజ్!" ఆవేదన యావత్తూ రాణిని చుట్టేసింది.

"చెప్పరా ఏమైందిరా అమ్మాయికి?"

"మా షెడ్డుకి ఓ బండి అమ్మకానికి వచ్చింది. దాని వివరాలన్నీ చూస్తే అది మీ బండే. తెచ్చినవాడిని నిలదీశాను. తనకో ఆటో డ్రైవర్ అమ్మాడని తిరిగి తను మారుబేరం పెడుతున్నానని చెప్పాడు.వాడ్ని గుంజి వాయిస్తే మొత్తం సంగతి చెప్పుకు వచ్చాడు. ఆటో డ్రైవర్ ఓ అమ్మాయిని తీసుకొచ్చి ఓ చోట ఉంచి, డబ్బుల కోసం బండి అమ్మకానికి పెట్టి రమ్మని తనని పంపాడని చెప్పాడు. అంతే వాడిని జడిపించాను. తీగ లాగితే డొంకంతా కదిలినట్లుగా కథంతా బయటపడింది. అసలు హీరో మీ ముద్దుల కూతురు. మౌనిక ఇష్టపడ్డ ఆటో డ్రైవర్. వాడి గుడ్డి ప్రేమలో మోసపోయినందుకు ఫలితం ఓ వ్యభిచార కూపానికి అమ్మివేయబడింది. ఈ బండి కాస్త అమ్మేసి చెక్కేద్దామనుకున్నాడు వాడు. నేను వెళ్ళేసరికి పరారై పోయాడు. మొత్తం కూపీ లాగి మౌనికను ఆ ఊబిలో కూరుకుపోకముందే రక్షించాను" అన్నాడు కనులు చెమర్చగా.

"ఒరే నీ మేలు.." చేతులు పట్టుకుని బాధతో అన్నాను.

"అన్నయ్యా నీకెలా" అంతులేని ఆవేదన రాణిది.

"చూశారా! మౌనిక ఎంత అమాయకపుదో. తను వెళ్ళే ట్యూషన్ దగ్గర నిల్చుని రోజూ తప్పకుండా కాపు కాసి తీయని మాటలాడి పరిచయం పెంచుకున్న అఫ్ట్రాల్ ఓ ఆటో డ్రైవర్‌తో అనుబంధం పెంచుకుంది. కారణం అతనితో తన జీవితం స్వర్గం అనుకోవటం. తల్లిదండ్రులున్న ఇల్లు ఓ బృందావనంలా అనిపించాలి తప్ప, భయపెట్టే భూతాల భవనంలా కనపడకూడదు. మౌనిక మీ నుండి అమృతతుల్యమైన మమతానుబంధానికి బదులు అగమ్యమైన అభద్రతా భావాన్ని చవి చూసింది. అందుకే తనకు వేరే అనుబంధం కోసం వెంపర్లాడింది. ఈ రోజుల్లో తొంభై శాతం తల్లిదండ్రులు ఆడపిల్లను ముద్దుకొద్దీ మగాడిలా పెంచాలని, చదివించాలని పోటీపడుతున్నారు. ఆశయం మంచిదే కానీ వేసే అడుగులు తప్పుదారి పట్టిస్తున్నాయి. సంపాదన వ్యామోహంలో పడి పిల్లలను పట్టించుకోవటం లేదు. ప్రస్తుతం తల్లిదండ్రుల వైఖరి గమనిస్తే రెండు పద్ధతులు. బంధిస్తే పూర్తిగా బంధించటం లేకపోతే పూర్తి స్వేచ్ఛనివ్వటం, రెండూ మంచివి కావు. సంయమన పద్ధతి ఎవరూ పాటించటం లేదు. ముందు మీలాంటి తల్లిదండ్రులు తమ పిల్లలతో అనుబంధానికి సమయం వెచ్చించాలి. అప్పుడే **పిల్లల అడుగులు సవ్యమార్గంలో పయనిస్తాయి. లేకుంటే వారి నిర్ణయాలు వారు తీసుకుంటారు.** పర్యవసానం ఇదిగో ఇలాగే ఉంటుంది" అడ్డుకట్ట వేయలేని ఆవేశంతో ఆవేదనతో మాట్లాడాడు సుదర్శనం.

"అన్నయ్యా మౌనికకు ఏం కాలేదు కదా?"

"లేదమ్మా క్షేమంగా ఉంది. మీ దగ్గర మొహం చూపటానికి సిగ్గుపడుతోంది. అందువల్ల మీరే నాతోపాటు రండి తీసుకెళతా" ఆత్మీయత ఉట్టిపడింది సుదర్శనం గొంతులో.

కొన్ని క్షణాల క్రితందాకా మౌనిక మాకు ద్రోహం చేసిందనే భావించాం. కానీ అది అపోహ. మేమే మౌనికకు ద్రోహం చేశాం. అనుబంధానికి దూరం చేసి...

ఇది అక్షరాలా నిజం.

దయచేసి మా పొరపాటు మ(మీ)రెవరూ చేయొద్దు. ←



## జెనీలియా కూడా త్రిష బాటలోనే!

'**బాయ్స్**' హీరోయిన్ జెనీలియా కూడా త్రిష బాటలోనే నడుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల వెంకటేష్‌తో 'సుభాష్ చంద్రబోస్'లో హీరోయిన్‌గా కనిపించిన ఈ చిన్నది పెద్ద హీరోల ప్రక్కన ఇక నటించనని తెగేసి చెబుతోంది. యవ్వనం ఉట్టిపడే తన ప్రక్కన ఆ పెద్ద హీరోలు మరీ ముసలాళ్లలా కనిపిస్తున్నారని, అందుకే తనలాంటి నిర్ణయం తీసుకున్నానని చెప్పింది. మరీ సుభాష్ చంద్రబోస్‌లో పాటలకే పరిమితమయ్యావేంటమ్మా అనడిగితే ముందు తనకు చెప్పిన కథ వేరనీ తీరా సినిమాలో తన పాత్ర పరిధిని తగ్గించారనీ వాపోయింది.

